# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 06 ఫిబ్రవరి 2026 | www.balagamtv.com | పేజీలు 4


## గ్రూప్-1 అభ్యర్థులకు భారీ ఊరట

● సింగిల్ జడ్జి తీర్పు రద్దు -- నియామకాలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్

బలగం టీవీ, హైదరాబాద్:



గ్రూప్-1 అభ్యర్థులకు తెలంగాణ హైకోర్టు గురువారం కీలక ఊరటనిచ్చింది. గ్రూప్-1 పోస్టుల జనరల్ ర్యాంకింగ్ లిస్ట్‌ను రద్దు చేస్తూ, మెయిన్స్ పరీక్షల జవాబు పత్రాలను తిరిగి మూల్యాంకనం చేయాలని సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును హైకోర్టు డివిజన్ బెంచ్ రద్దు చేసింది. ఈ మేరకు ఎంపికైన అభ్యర్థులు దాఖలు చేసిన అప్పీల్స్‌ను డివిజన్ బెంచ్ అనుమతిస్తూ, సింగిల్ జడ్జి ఉత్తర్వులను కొట్టివేసింది. దీంతో గ్రూప్-1 నియామక ప్రక్రియ కొనసాగేందుకు మార్గం సుగమమైంది.

**న్యాయ విజయం: సీఎం రేవంత్ రెడ్డి**

హైకోర్టు తీర్పుపై ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి స్పందిస్తూ, దీనిని న్యాయ విజయంగా అభివర్ణించారు. ప్రభుత్వ నియామకాలను అడ్డుకునేందుకు పలు మిగితా 4వ పేజీలో

## మేఘాలయలో బొగ్గుగనిలో ప్రమాదం

**గనిలో భారీ పేలుడు 16 మంది కార్మికులు మృతి కొనసాగుతున్న సహాయక చర్యలు**



బలగం టీవి, షిల్లాంగ్

మేఘాలయ రాష్ట్రం ఈస్ట్ జయంతియా హిల్స్ జిల్లాలోని థాంగ్స్కు ప్రాంతంలో ఉన్న అనుమానాస్పద అక్రమ బొగ్గు గనిలో జరిగిన భారీ పేలుడు ఘటనలో కనీసం 16 మంది కార్మికులు మృతి చెందినట్లు పోలీసులు గురువారం తెలిపారు. ఇటీవలి కాలంలో చోటుచేసుకున్న అత్యంత ఘోరమైన గనిప్రమాదాల్లో ఇది ఒకటిగా భావిస్తున్నారు. ఈస్ట్ జయంతియా హిల్స్ జిల్లా ఎస్పీ వికాస్ కుమార్ మృతుల సంఖ్యను ధృవీకరించారు. ప్రమాద స్థలం నుంచి ఇప్పటివరకు 16 మృతదేహాలను వెలికితీశామని, సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. "ఇప్పటివరకు 16 మృతదేహాలు లభించాయి. గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి," అని ఎస్పీ పేర్కొన్నారు.

గనిలో బొగ్గు తవ్వకాలు జరుగుతున్న సమయంలో పేలుడు సంభవించి, ఆ తరువాత గని కూలిపోయినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. పేలుడుకు గల ఖచ్చితమైన కారణాలు ఇంకా నిర్ధారణ కాలేదని, అయితే క్రియాశీల తవ్వకాల సమయంలోనే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక సమాచారం సూచిస్తోందని తెలిపారు. ఈ ప్రమాదంలో ఒక కార్మికుడు తీవ్ర గాయాలతో బయటపడగా, తొలుత అతడిని సుటంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్స కోసం షిల్లాంగ్‌కు రిఫర్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అతని ఆరోగ్య పరిస్థితిని వైద్యులు నిశితంగా పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు.

సహాయక చర్యల కోసం జాతీయ విపత్తు సహాయక బృందం , రాష్ట్ర విపత్తు సహాయక బృందం బృందాలను ఘటనా స్థలానికి పంపినట్లు ఎస్పీ తెలిపారు. స్థానిక పోలీసులు, జిల్లా యంత్రాంగంతో కలిసి వారు సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. అస్థిర భూమి పరిస్థితులు, మరిన్ని కూలింపుల ప్రమాదం ఉండటంతో సహాయక చర్యలు అత్యంత క్లిష్టంగా కొనసాగుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ గని అక్రమంగా నడుస్తుందా అన్న ప్రశ్నకు స్పందించిన ఎస్పీ, ప్రాథమికంగా అక్రమ గనిగా అనుమానాలు ఉన్నాయని తెలిపారు. "అవును, అలానే కనిపిస్తోంది. అయితే పూర్తి విచారణ అనంతరం వాస్తవాలు వెల్లడిస్తాం," అని ఆయన అన్నారు. ఈ ఘటనతో ఈస్ట్ జయంతియా హిల్స్ జిల్లాలో నిషేధిత అక్రమ బొగ్గు తవ్వకాలు ఇంకా కొనసాగుతున్నాయన్న విషయం మరోసారి వెలుగులోకి వచ్చింది. కోర్టు ఆదేశాలు, పలుమార్లు నిర్వహించిన దాడులున్నప్పటికీ అక్రమ గనుల సమస్య తీరడం లేదని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. పూర్తి విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## వరంగల్-కరీంనగర్

# సమగ్రాభివృద్ధికి బృహత్ ప్రణాళిక

### రెండు పట్టణాలకు ఔటర్ రింగ్ రోడ్లు



- మధ్యలో భారీ డంప్ యార్డ్, విద్యుత్ కేంద్రం
- దేశానికే ఆదర్శంగా నిలిచే మున్సిపల్ కార్పొరేషన్లుగా వాటిని తీర్చిదిద్దుతాం
- 2027 గోదావరి పుష్కరాల దృష్ట్యా బాసర పుణ్యక్షేత్రం నుంచి భద్రాచలం వరకు ఉన్న అన్ని దేవాలయాలను సమగ్ర ప్రణాళికలతో అభివృద్ధి
- గడిచిన రెండేళ్లలో 70 వేల ఉద్యోగాలను భర్తీ చేశాం
- మహిళా సంఘాలకు సున్నా వడ్డీకే రూ.27 వేల కోట్ల రుణాలు అందించాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

బలగం టీవి, కరీంనగర్

వరంగల్, కరీంనగర్ పట్టణాల సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం బృహత్ ప్రణాళికను రూపొందించిందని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ రెండు పట్టణాలకు ఔటర్ రింగ్ రోడ్లను పూర్తి చేయడమే కాకుండా, వాటిని అనుసంధానించే రహదారులను విస్తరిస్తామని తెలిపారు. అలాగే రెండు పట్టణాల మధ్య అతి పెద్ద డంప్ యార్డ్ ఏర్పాటు చేసి, అక్కడ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మించనున్నట్లు వెల్లడించారు.

కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని గుమ్లాపూర్‌లో నిర్వహించిన "ప్రజాపాలన- ప్రగతి బాట" కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చొప్పదండిలో రూ.45.15 కోట్లతో నిర్మించనున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)కు, అలాగే గంగాధర మండలంలో రూ.5 కోట్లతో నిర్మించనున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ, వరంగల్‌కు ఔటర్ రింగ్ రోడ్డుతో పాటు విమానాశ్రయాన్ని పూర్తి చేసి, కరీంనగర్ ఔటర్ రింగ్ రోడ్డుతో అనుసంధానం చేసి ఈ రెండు పట్టణాలను జంట నగరాలుగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. దేశానికే ఆదర్శంగా నిలిచే మున్సిపల్ కార్పొరేషన్లుగా వాటిని తీర్చిదిద్దుతామని అన్నారు.

2027 గోదావరి పుష్కరాల దృష్ట్యా ఆదిలాబాద్ జిల్లా బాసర పుణ్యక్షేత్రం నుంచి ఖమ్మం భద్రాచలం వరకు ఉన్న అన్ని దేవాలయాలను సమగ్ర ప్రణాళికలతో అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఇందుకోసం అవసరమైతే రూ.4--5 వేల కోట్ల వరకు ఖర్చు చేసి దేవాలయాల అభివృద్ధి బాధ్యతను తానే తీసుకుంటానని ప్రకటించారు. పుష్కరాల నాటికి ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రాలు, పుణ్యక్షేత్రాలుగా అభివృద్ధి చేయడంతో పాటు, మధ్యలోని అటవీ ప్రాంతాల్లో ఎకోటూరిజాన్ని ప్రోత్సహిస్తామని తెలిపారు.

రాష్ట్రంలో రైతులు, విద్యార్థులు, యువత, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని సీఎం చెప్పారు. వ్యవసాయాన్ని "దండగ కాదు -- పండగ" చేయాలన్న లక్ష్యంతో రూ.2 లక్షల వరకు రుణమాఫీ, గిట్టుబాటు ధర, సన్నవడ్లకు బోనస్, రైతు బీమా, రైతుభరోసా వంటి పథకాల ద్వారా వ్యవసాయ రంగానికి దేశంలోనే అత్యధికంగా రూ.1.15 లక్షల కోట్లను ఖర్చు చేశామని తెలిపారు. గడిచిన రెండేళ్లలో 70 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, బీసీ, ఎస్సీ హాస్టళ్లు శిథిలావస్థలో ఉండటంతో వంద యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల నిర్మాణం చేపట్టామని చెప్పారు. సాంఘిక సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు మెస్ చార్జీలను 40 శాతం, కాస్మెటిక్ చార్జీలను 200 శాతం పెంచినట్లు తెలిపారు.

మహిళల ఆత్మగౌరవం కాపాడాలనే లక్ష్యంతో ఆర్టీసీలో ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని, మహిళా సంఘాలకు సున్నా వడ్డీకే రూ.27 వేల కోట్ల రుణాలు అందించామని సీఎం పేర్కొన్నారు. మహిళా సంఘాలకు వెయ్యి బస్సులు, పెట్రోల్ బంకులు, వెయ్యి మెగావాట్ల సోలార్ విద్యుత్ కేంద్రాలు కేటాయించినట్లు వివరించారు. ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో చేసిన పనులను శాసనసభ వేదికగా వెల్లడించేందుకు సిద్ధంగా ఉన్నామని, తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి చేసుకునే సత్తా తెలంగాణకు ఉందని స్పష్టం చేశారు. ఈ సభలో జిల్లా ఇంచార్జీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రసంగించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా మహిళా సమాఖ్య (శ్రీ సీతారామచంద్ర జిల్లా సమాఖ్య)కు ముఖ్యమంత్రి రూ.110.10 కోట్ల చెక్కును అందజేశారు.

## భారత్‌తో వాణిజ్య ఒప్పందాలకు ప్రపంచ దేశాల ఆసక్తి

- యూరోపియన్ యూనియన్, అమెరికాతో ఒప్పందాలు
- ప్రధాని మోదీ

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో



భారత్‌తో వాణిజ్య ఒప్పందాలు చేసుకునేందుకు ప్రపంచంలోని పెద్దపెద్ద దేశాలు ఆసక్తి చూపుతున్నాయని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. ఇటీవల యూరోపియన్ యూనియన్‌లోని 27 దేశాలతో పాటు అమెరికాతో కూడా వాణిజ్య ఒప్పందాలు కుదిరినట్లు చెప్పారు. ఈ ఒప్పందాల నేపథ్యంలో ప్రపంచ దేశాలన్నీ భారత్‌ను ప్రశంసిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో ప్రధాని ప్రసంగిస్తూ, యూరోపియన్ యూనియన్‌తో వాణిజ్య ఒప్పందం జరగటంతో ప్రపంచవ్యాప్తంగా స్థిరత్వం పెరుగుతుందనే నమ్మకం ఏర్పడిందని అన్నారు. అమెరికాతో ఒప్పందం అనంతరం ఆ భరోసా మరింత బలపడిందని, స్థిరత్వంతో పాటు వేగం కూడా పెరుగుతుందని మోదీ స్పష్టం చేశారు.

గతంలో భారత్‌తో ఒప్పందాలకు దేశాలు ముందుకు వచ్చేవి కాదని, ఇప్పుడు అభివృద్ధి చెందిన దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నామని తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాలు వృద్ధి చెందుతున్న దేశాలతోనే ఒప్పందాలు చేస్తాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వైబ్రంట్ గుజరాత్ ద్వారా సంస్కరణలకు శ్రీకారం చుట్టానని, తయారీ రంగంలో బలమైన ఎకోసిస్టమ్ ఉన్నప్పుడే దేశాలు ఒప్పందాలకు ముందుకు వస్తాయని వివరించారు.

రిఫార్మ్, పెర్‌ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్ మంత్రంతో భారత్ దూసుకెళ్తోందని ప్రధాని తెలిపారు. ఉత్పత్తి రంగంలో భారత్ అనేక విజయాలు సాధించిందని, సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌పై దేశం వేగంగా ముందుకు సాగుతోందన్నారు. భారత్‌లోని ఎంఎస్ఎంఈలు ప్రపంచ దేశాల విశ్వాసాన్ని చూరగొంటున్నాయని, అంతర్జాతీయ పోటీకి భారత్ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉందన్నారు. అమెరికాతో ట్రేడ్ డీల్ అనంతరం భారత్ బలం మరింత పెరిగిందని, ఈ ఒప్పందం వల్ల దేశ యువతకు అధిక ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. ప్రపంచ దేశాలన్నీ భారత యువతను స్వాగతిస్తున్నాయని మోదీ అన్నారు.

కాంగ్రెస్, టీఎంసీ, డీఎంకే, లెఫ్ట్ పార్టీల వైఖరిపై ప్రశ్నలు లేవనెత్తారు. యూపీఏ పాలనలో సగం మంది ప్రజలకు బ్యాంకులే తెలియవని, ఎన్డీఏ ప్రభుత్వంలో పేదలకు బ్యాంకు ఖాతాలు కల్పించామని చెప్పారు. బ్యాంకింగ్ రంగంలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని, ముద్ర యోజన ద్వారా రూ.30 లక్షల కోట్ల రుణాలు ఇచ్చామని తెలిపారు. ఈ పథకం ద్వారా కోట్లాది మంది యువత స్వయం ఉపాధి పొందారని చెప్పారు. మిగితా 4వ పేజీలో




## తెలంగాణలో ఏప్రిల్ లేదా మేలో 'సర్'

బలగం టీవీ, హైదరాబాద్:

దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో ప్రత్యేక సుదీర్ఘ సవరణ 'సర్' కొనసాగుతున్నదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) సి సుదర్శన్‌రెడ్డి చెప్పారు. ఏప్రిల్ లేదా మేలో తెలంగాణ సహా మిగతా రాష్ట్రాలకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశముందని వివరించారు. సర్ ను దృష్టిలో ఉంచుకుని అంతకు ముందే బూత్ లెవెల్ ఏజెంట్ (బీఎల్ఏ)ను నియమించాలని రాజకీయ పార్టీలకు సూచించారు. గురువారం హైదరాబాద్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ బూత్ స్థాయిలో బలమైన సమన్వయం ఈ ప్రక్రియకు కీలకమని స్పష్టం చేశారు. బీఎల్ఏలను సాధ్యమైనంతవరకు ఆయా పోలింగ్ స్టేషన్ల పరిధిలోని స్థానికుల నుంచే ఎంపిక చేయాలనీ, వారు బూత్ లెవల్ అధికారులతో (బీఎల్ఓలు) సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణ సమయంలో ఖచ్చితత్వం, పారదర్శకత, సమస్యల పరిష్కారం కోసం ప్రతి పోలింగ్ బూత్‌కు కనీసం ఒక బీఎల్ఏ తప్పనిసరిగా ఉండాలన్నారు. సర్ నోటిఫికేషన్ వెలువడిన తర్వాత సమయం పరిమితంగా ఉండటంతో రాష్ట్రంలో ముందస్తు సన్నాహక పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని చెప్పారు. ఈ సన్నాహక చర్యల్లో భాగంగా 2025 ఓటర్ల జాబితాలో ఉన్న ఓటర్లను 2002 సర్‌లో నమోదైన ఓటర్లతో అనుసంధానించేలా టేబుల్‌టాప్ మ్యాపింగ్ చేపట్టామని అన్నారు. అనంతరం ఫీల్డ్ స్థాయి మ్యాపింగ్ కొనసాగుతుందనీ, పట్టణ ప్రాంతాల్లో నివాసాలను గుర్తించి ధృవీకరించేందుకు మిగితా 4వ పేజీలో

## భారత్ ట్యాక్సీ ప్రారంభించిన అమిత్ షా

- దేశంలోనే తొలి సహకార ఆధారిత రైడ్-హైలింగ్ వేదిక
- కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో




దేశంలోనే తొలి సహకార యాజమాన్య ఆధారిత రైడ్--హైలింగ్ వేదిక లిలి'భారత్ ట్యాక్సీ'లిలిని కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా గురువారం అధికారికంగా ప్రారంభించారు. రెండు నెలల పాటు నిర్వహించిన పైలట్ ప్రాజెక్టు విజయవంతమైన అనంతరం ఈ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం డిల్లీ--ఎన్‌సీఆర్, గుజరాత్ రాష్ట్రాల్లో భారత్ ట్యాక్సీ సేవలు అందుబాటులో ఉన్నాయని, వచ్చే రెండేళ్లలో దేశవ్యాప్తంగా విస్తరించనున్నట్లు అమిత్ షా వెల్లడించారు. మూడు సంవత్సరాల లోపు కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, ద్వారక నుంచి కామాఖ్య వరకు ప్రతి మూలకు భారత్ ట్యాక్సీ సేవలు చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

**డ్రైవర్లకే లాభాల వాటా**

భారత్ ట్యాక్సీ ప్రత్యేకత ఏమిటంటే, ఈ వేదికలో డ్రైవర్లే భాగస్వాములుగా ఉండి లాభాల్లో వాటా పొందుతారు. ఇతర ప్రైవేట్ యాప్‌ల మాదిరిగా కమిషన్లు, సర్జ్ ప్రైసింగ్ ఉండవని అధికారులు తెలిపారు. ప్రయాణికులు కార్లు, మూడు చక్రాల వాహనాలు, ద్విచక్ర వాహనాలు వంటి వివిధ వాహనాలను ఎంపిక చేసుకునే సౌకర్యం కల్పించారు. భారత్ ట్యాక్సీని మల్టీ స్టేట్ కోఆపరేటివ్ సొసైటీస్ చట్టం--2002 కింద నమోదు చేయగా, అధికారికంగా జూన్ 6, 2025న కార్యకలాపాలు ప్రారంభించింది.

సహకార శాఖ ప్రకారం, భారత్ ట్యాక్సీ ఇప్పటికే ప్రపంచంలోనే అతిపెద్ద డ్రైవర్ యాజమాన్య మొబిలిటీ ప్లాట్‌ఫామ్‌గా నిలిచింది. డిసెంబర్‌లో ప్రారంభమైన పైలట్ దశ నుంచి ఇప్పటివరకు: మిగితా 4వ పేజీలో

## తెలంగాణ గ్రామ పంచాయతీలకు కేంద్రం శుభవార్త

- 15వ ఆర్థిక సంఘం నిధుల
- తొలి విడతగా రూ.259.36 కోట్లు విడుదలలిలి

వివరాలు 4వ పేజీలో

## బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం



- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- 'సేవ్ తెలంగాణ' ప్రజెంటేషన్ కార్యక్రమం

బలగం టీవీ, హైదరాబాద్:

తెలంగాణ రాష్ట్రంలో అవినీతి పాలన రాజ్యమేలుతోందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర నేత కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. గత పదేళ్ల టీఆర్ఎస్ పాలనలోనూ, గత 26 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనూ అవినీతి తప్ప రాష్ట్ర అభివృద్ధి కనిపించలేదని ఆరోపించారు. గురువారం "సేవ్ తెలంగాణ" ప్రజెంటేషన్ కార్యక్రమంలో భాగంగా ముషీరాబాద్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిపై రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను ప్రదర్శించడంతో పాటు ప్రత్యేక గీతాన్ని ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. టీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజాధనాన్ని దోచుకోవడమే తప్ప రాష్ట్ర ప్రజల అవసరాలను తీర్చడంలో పూర్తిగా విఫలమయ్యాయని మిగితా 4వ పేజీలో

## మరోసారి మోసం చేయబోతోన్న కాంగ్రెస్



- చేతిలో అధికారం ఉన్నా కేసీఆర్‌ను తిట్టడమే సీఎం పని
- జిల్లాలు ఎత్తివేయాలనే కుట్రకు ప్రజలు బుద్ధి చెప్పాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయకుండా, మున్సిపల్ ఎన్నికల పేరుతో కాంగ్రెస్ పార్టీ మరోసారి ప్రజలను మోసం చేయడానికి సిద్ధమవుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా గురువారం సిరిసిల్ల పట్టణంలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల తర్వాత రైతుబంధు వేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నారని, అయితే ఇప్పటివరకు ఎన్ని పంట కాలాలు గడిచాయో, ఎన్ని సార్లు రైతుబంధు రైతుల ఖాతాల్లో వేసారో చెప్పాలని, ఎన్నికలకు రైతుబంధు వేయడానికి అడ్డంకి ఏంటని ప్రశ్నించారు. కేవలం ఎన్నికలు పూర్తయ్యేంత వరకే ఆశ చూపించి, మరోసారి రైతులను మోసం చేయడానికే ఈ హామీలు ఇస్తున్నారని అన్నారు. ఎన్నికల ముందు అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలను కూడా పక్కన పెట్టిందని అన్నారు . ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయలేదని, ప్రజలను పూర్తిగా మోసం చేస్తోందని, మరోసారి కాంగ్రెస్ మాటలు నమ్మి ఓటు వేస్తే ప్రజలు మళ్లీ మోసపోవడం ఖాయమని అన్నారు. చేతిలో అధికారం, అవకాశం ఉన్నప్పటికీ గత ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని, చేతనైతే ప్రజలకు మంచి చేయాలి, హామీలు అమలు చేయాలే తప్ప, కేసీఆర్‌ను విమర్శించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. గత రెండు ఏళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కటంటే ఒక్క మంచి పని కూడా చేయలేదని అన్నారు.

కేసీఆర్ ఏర్పాటు చేసిన చిన్న జిల్లాలను ఎత్తివేయాలనే కుట్ర కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందని ఆరోపించారు. జిల్లాలను రద్దు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ మాటలను గుర్తు పెట్టుకుని ఓటు వేయాలని ,జిల్లా కేంద్రాల రద్దు మంచా, చెడ్డా అన్నది ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ఈ మున్సిపల్ ఎన్నికలు గత మిగితా 4వ పేజీలో



## మేడారం హుండీ లెక్కింపు ప్రారంభం

- పారదర్శకంగా, కట్టుదిట్టమైన భద్రతతో లెక్కింపు: మంత్రి కొండా సురేఖ

బలగం టీవీ, హైదరాబాద్

మేడారం సమ్మక్క--సారక్క వనదేవతల హుండీ లెక్కింపు ప్రక్రియను టిటిడి కల్యాణ మండపంలో మంత్రి కొండా సురేఖ గురువారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మేడారం జాతరకు దేశ విదేశాల నుంచి వచ్చిన భక్తులు సమర్పించిన కానుకలను పూర్తిస్థాయి భద్రతా చర్యలు, పారదర్శక విధానాలతో లెక్కించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. హుండీ లెక్కింపు ప్రక్రియ మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షణలో, సంబంధిత అధికారుల సమక్షంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వహించబడుతుందని మంత్రి స్పష్టం చేశారు. భక్తుల విశ్వాసానికి ఎలాంటి లోటు లేకుండా ప్రతి రూపాయిని జాగ్రత్తగా లెక్కించి, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వినియోగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మేడారం సమ్మక్క--సారక్క వనదేవతల ఆశీస్సులతో జాతరను విజయవంతంగా నిర్వహించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి ఒక 'బూతుల సీఎం'..

- ఆయన భాష తెలంగాణ సంస్కృతికే మచ్చ..
- రేవంత్ రెడ్డి తీరు తెలంగాణ ఆత్మగౌరవంపై దాడి
- రేవంత్ రెడ్డి జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదు.. కానీ స్కాం క్యాలెండర్ మాత్రం ఇచ్చారు..
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు

బలగం టీవీ, హైదరాబాద్:




ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు తీవ్రస్థాయిలో విరుచుకు పడ్డారు. రేవంత్ రెడ్డి వాడుతున్న భాష సభ్య సమాజం అసహ్యించుకునేలా ఉందని, చరిత్రలో ఆయనొక వికృత మనస్తత్వం కలిగిన "బూతుల సీఎం"గా మిగిలిపోతారని విమర్శించారు. గురువారం మీడియాతో మాట్లాడిన ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. రేవంత్ రెడ్డి వికృత భాష వల్ల తెలంగాణ ప్రతిష్ట దిగజారుతోందని హరీష్ రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో రాష్ట్ర మేధావులు, బుద్ధిజీవులు మౌనం వహించడం రాష్ట్రానికి ప్రమాదకరమని హెచ్చరించారు. నిరుద్యోగులకు 'జాబ్ క్యాలెండర్' ఇస్తానని మోసం చేసిన రేవంత్, ఇప్పుడు నెలకు ఒక స్కామ్‌తో 'స్కాం క్యాలెండర్' అమలు చేస్తున్నారని ఆరోపించారు. పాలనను గాలికొదిలేసి, కేవలం జేబులు నింపుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారని మండిపడ్డారు. తన కుర్చీని కాపాడుకోవడానికి రేవంత్ రెడ్డి బీజేపీతో చీకటి ఒప్పందం చేసుకున్నారని, అందుకే కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిపై కేంద్రం ఎలాంటి విచారణ జరిపించడం లేదని హరీష్ రావు ఎద్దేవా చేశారు. రుణమాఫీ, రైతుబంధు, వడ్లకు బోనస్ వంటి హామీలను ఎగ్గొట్టి రైతులను నట్టేట ముంచారని విమర్శించారు. గతంలో కేసీఆర్ హయాంలో ఉన్న 24 గంటల కరెంటును ఇప్పుడు 12 గంటలకు కుదించారని ధ్వజమెత్తారు. "తన రెండేళ్ల పాలనలో ప్రజలకు చేసింది ఏమీ లేక, తన అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికే రేవంత్ రెడ్డి వికృత భాషను ఆశ్రయిస్తున్నారు. తెలంగాణ జాతిపిత కేసీఆర్ ని చూసి ఓర్వలేక విషం కక్కుతున్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాష, ప్రవర్తన తెలంగాణ ప్రతిష్టను దిగజార్చేలా ఉన్నాయని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రంగా విమర్శించారు. అమెరికా పర్యటన ముగించుకుని వచ్చిన తర్వాత రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అత్యంత ఆవేదన కలిగిస్తున్నాయని, ఒక ముఖ్యమంత్రి హోదాలో ఉండి అదుపుతప్పి మాట్లాడటం సభ్య సమాజం ఛీకొట్టేలా ఉందని ఆయన మండిపడ్డారు. మిగితా 4వ పేజీలో



# ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- **కలెక్టర్ పమేలా సత్పతి, సీపీ గౌష్ ఆలం సమీక్ష..**

**బలగం టీవీ, కరీంనగర్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం కరీంనగర్ జిల్లా, చొప్పదండి మండలంలోని గుమ్లాపూర్ గ్రామంలో పర్యటించనున్నారు. ఈ పర్యటనను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం బుధవారం క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను సమీక్షించారు.

ముఖ్యమంత్రి రాక కోసం ఏర్పాటు చేసిన హెలిప్యాడ్, బహిరంగ సభా ప్రాంగణాన్ని అధికారులు నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. పర్యటన నేపథ్యంలో భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. భద్రతను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచనున్నట్లు సీపీ తెలిపారు. సభకు వచ్చే ప్రజలకు, వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పక్కాగా పార్కింగ్ స్థలాలను కేటాయించారు. ట్రాఫిక్ మళ్లింపుపై సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. సభా ప్రాంగణంలో తాగునీరు, ఇతర కనీస వసతులకు ఆటంకం కలగకుండా చూడాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# బిట్స్- పిలానీ హైదరాబాద్‌కు రూ. 36 కోట్ల భారీ విరాళం

- **పూర్వ విద్యార్థి చంద్ పి.గర్గ్ దంపతుల ఉదారత**

**బలగం టీవీ, హైదరాబాద్:**




ప్రముఖ విద్యాసంస్థ బిట్స్ -- పిలానీ (హైదరాబాద్ క్యాంపస్ అభివృద్ధికి అండగా నిలిచేందుకు ఆ సంస్థ పూర్వ విద్యార్థి, ప్రముఖ వ్యాపారవేత్త చంద్ పి.గర్గ్ మరియు ఆయన భార్య మంజు గర్గ్ రూ. 36 కోట్ల (4 మిలియన్ డాలర్లు) భారీ విరాళాన్ని ప్రకటించారు. విద్యా ప్రమాణాలను మెరుగుపరచడం మరియు పరిశోధనలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ విరాళం అందించారు. చంద్ పి.గర్గ్ 1968లో బిట్స్ -- పిలానీలో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. అనంతరం ఆయన అమెరికాలో స్థిరపడి, ఇంటర్నేషనల్ ట్రేడ్స్ మరియు క్రెడిట్స్ వ్యాపార రంగంలో విశేష ప్రతిభ కనబరిచారు. తనను ఉన్నత విద్యావంతుడిగా తీర్చిదిద్దిన సంస్థపై కృతజ్ఞతతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు.

ప్రపంచవ్యాప్తంగా తమ విద్యా సంస్థల్లో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పేందుకు బిట్స్ -- పిలానీ కార్యవర్గం 18 నెలల క్రితం 100 మిలియన్ డాలర్ల నిధిని సమీకరించాలని నిర్ణయించింది. ఈ లక్ష్యంలో భాగంగా గర్గ్ దంపతులు తమ వంతుగా 4 మిలియన్ డాలర్లను (రూ. 36 కోట్లు) హైదరాబాద్ క్యాంపస్‌కు కేటాయించారు. బిట్స్ -- పిలానీ పూర్వ విద్యార్థులు ఇప్పటి వరకు ప్రపంచవ్యాప్తంగా మొత్తం 34 మిలియన్ డాలర్ల విరాళాలను సేకరించడం విశేషం. ఈ విరాళంపై బిట్స్ -- పిలానీ యాజమాన్యం హర్షం వ్యక్తం చేస్తూ, గర్గ్ దంపతులకు ధన్యవాదాలు తెలిపింది. ఈ నిధులను క్యాంపస్‌లో మౌలిక సదుపాయాల కల్పన, అత్యాధునిక ల్యాబ్‌ల ఏర్పాటు మరియు విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం వినియోగించనున్నట్లు సంస్థ పేర్కొంది.

# నామినేషన్ కోసం రూ. 8 కోట్ల పన్ను కట్టిన కార్పొరేటర్ అభ్యర్థి!



**బలగం టీవీ, నిజామాబాద్:**

రాజకీయాల్లోకి రావాలంటే పదవి మీద ఎంత వ్యామోహం ఉండాలో తెలీదు కానీ, నిబంధనల ముందు మాత్రం ఎంతటి వారైనా తలవంచాల్సిందేనని నిజామాబాద్ ఘటన నిరూపించింది. కాంగ్రెస్ నుంచి మేయర్ రేసులో ఉన్న శమంత నరేందర్ రెడ్డి, తన రాజకీయ భవిష్యత్తు కోసం ఏకంగా రూ. 8,16,65,000 ఆస్తి పన్నును ఏకకాలంలో చెల్లించి అందరినీ విస్మయానికి గురిచేశారు. 2009 నుంచి అంటే దాదాపు 17 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను, ఎన్నికల నోటిఫికేషన్ పుణ్యమా అని మున్సిపల్ ఖజానాకు చేర్చారు.

**హైకోర్టు మెట్లెక్కినా తప్పని చెల్లింపు**

నగరంలోని ఒక ప్రముఖ హోటల్‌లో డైరెక్టర్‌గా ఉన్న నరేందర్ రెడ్డి భార్యకు కార్పొరేటర్‌గా పోటీ చేసేందుకు నో డ్యూ సర్టిఫికేట్ అనివార్యమైంది. బకాయిలు చెల్లిస్తేనే సర్టిఫికేట్ ఇస్తామని అధికారులు తెగేసి చెప్పడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. అయితే, అర్ధరాత్రి 12 గంటల వరకు సాగిన వాదనల అనంతరం, చట్టం ముందు అందరూ సమానమేనని, బకాయిలు చెల్లించాల్సిందేనని న్యాయస్థానం స్పష్టం చేసింది. దీంతో చేసేదేం లేక, తన రాజకీయ లక్ష్యం కోసం ఆరు భారీ డీడీల రూపంలో ఆ మొత్తాన్ని మున్సిపల్ అధికారులకు సమర్పించారు . నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ చరిత్రలో ఒక వ్యక్తి నుంచి ఇంత భారీ మొత్తం పన్ను రూపంలో రావడం ఇదే మొదటిసారి. సాధారణంగా సామాన్యుల దగ్గర వందల రూపాయల పన్ను కోసం కఠినంగా వ్యవహరించే యంత్రాంగం, ఇన్నాళ్లుగా కోట్ల రూపాయల బకాయిని వసూలు చేయలేకపోవడంపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. ఏది ఏమైనా, ఎన్నికలు వస్తేనే బకాయిలు వసూలవుతాయి అనే కొత్త సూత్రాన్ని ఈ ఘటన నిజం చేసింది. పదవి మిస్ కాకూడదని కోట్ల చెల్లింపు మేయర్ సీటు మహిళలకు రిజర్వ్ కావడంతో నరేందర్ రెడ్డి కోట్లు కట్టేశారు. రేపు ఎన్నికల్లో ఇంకెంత ఖర్చు చేస్తారు అని సామాన్యులు చర్చించుకుంటున్నారు. కాంగ్రెస్ మేయర్ అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న ఆయనకు ఈ పన్ను చెల్లింపు రాజకీయంగా మైలేజ్ ఇస్తుందా లేక విమర్శలకు దారితీస్తుందా అన్నది వేచి చూడాలి. ఏదేమైనా, కార్పొరేషన్ ఖజానా మాత్రం ఒక్క రాత్రిలో కళకళలాడింది. మేయర్ అయితే ఆ దంపతులు అంతకు అంత సంపాదించుకునేందుకు ప్రయత్నించకుండా ఉండరు.

# కాంగ్రెస్‌ది దుష్టపాలన... కేసీఆర్‌తోనే సామాజిక న్యాయం

- **ఎంపీ వద్దిరాజు రవిచంద్ర**

**బలగం టీవీ, కొత్తగూడెం**



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దుష్టపాలన కొనసాగిస్తున్నదని, అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు కావడం లేదని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్రంగా విమర్శించారు. పరిపాలన చేతగాక కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.ఎంపీ వద్దిరాజు రవిచంద్ర మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, ఆయన కుమారుడు రాఘవతో కలిసి గురువారం కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 48వ డివిజన్ జగ్గుతండాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... కాంగ్రెస్ నాయకులు ఎన్నికల సమయంలో 432 హామీలు ఇచ్చి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక మోసం చేశారని ఆరోపించారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు 2014 జూన్ 14న అసెంబ్లీలో మహిళలు, బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలంటూ తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయాన్ని గుర్తు చేశారు. గిరిజనులకు 6 శాతం ఉన్న రిజర్వేషన్లను 10 శాతానికి పెంచిన మహానేత కేసీఆర్ అని కొనియాడారు. అయితే రేవంత్ రెడ్డి పాలనలో బీసీలకే కాకుండా గిరిజనులకు కూడా తీవ్ర అన్యాయం జరుగుతోందని, మున్నూరు కాపు, యాదవ్, రజక, లంబాడ వర్గాలకు మంత్రి పదవులు ఇవ్వలేదని విమర్శించారు. కేసీఆర్ తండాలు, గూడేలను గ్రామ పంచాయతీలుగా మార్చి గిరిజనుల ఆత్మగౌరవాన్ని పెంచారని అన్నారు.కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి చెందిన తెలంగాణ ఎంపీలు రాష్ట్రానికి నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారని ఎంపీ రవిచంద్ర దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నెరవేర్చకపోగా, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నదని మండిపడ్డారు. తెలంగాణను సాధించి అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిన కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చి అవమానించిన రేవంత్ రెడ్డికి తగిన బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందన్నారు. ఈ ఎన్నికల్లో కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్‌ను కైవసం చేసుకుని కేసీఆర్‌కు కానుకగా ఇద్దామని ఓటర్లను కోరారు.

**అరాచక పాలనపై ప్రజలు విసిగిపోయారు**

గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కొత్తగూడెం లోని 10వ డివిజన్ బూడిదగడ్డ, 58వ డివిజన్ హనుమాన్ బస్తీ, 25వ డివిజన్ ఏ పవర్ హౌస్ బస్తీల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ కాపు సీతామహాలక్ష్మి, మాజీ వైస్ ఛైర్మన్ వేల్పుల దామోదర్, అభ్యర్థులు వేల్పుల వీరమ్మ, ఏమునూరి శివకృష్ణ, వేముల ప్రసాద్ బాబు తదితరులతో కలిసి కాలినడకన ఇంటింటా ప్రచారం చేస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించగా, కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్రం అధోగతికి పాలవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని, ఇది కేసులు-- పోలీసుల ప్రభుత్వమని విమర్శించారు. అక్రమ కేసులు, వేధింపులకు భయపడబోమని, ప్రజలకు కొండంత అండగా కేసీఆర్ ఉన్నారని స్పష్టం చేశారు. ప్రజలు కేసీఆర్ పాలనను, రేవంత్ రెడ్డి పాలనను పోల్చి చూస్తున్నారని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తప్పకుండా భంగపాటు ఎదురవుతుందని చెప్పారు. సుమారు 6 కిలోమీటర్ల వరకు సాగిన ప్రచారంలో వందలాది కార్యకర్తలు, అభిమానులు గులాబీ జెండాలు చేతబూని ఉత్సాహంగా పాల్గొన్నారు. "జై తెలంగాణ", "బీఆర్ఎస్ జిందాబాద్", "కారు గుర్తుకే మన ఓటు" అంటూ నినాదాలు మార్మోగాయి. మహిళలు ఎంపీకి హారతులు ఇచ్చి స్వాగతం పలికారు.

**22వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం**

గురువారం సాయంత్రం ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 22వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ సీతామహాలక్ష్మి, డివిజన్ అభ్యర్థి చింతలపూడి పార్వతి, ఆమె భర్త జగన్‌తో పాటు భద్రాచలం నియోజకవర్గ ఇంఛార్జి రామకృష్ణ, పార్టీ నాయకులు కార్తీక్, మాచిన శ్రీకాంత్, గాజుల కృష్ణ, ఆసిఫ్, కిశోర్, సిరికొండ రాజు, ఎస్.కే. సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం..

- **రైసింగ్ తెలంగాణ కాదు... ఫాలింగ్ తెలంగాణ..**
- **యంగ్ ఇండియా స్కూల్స్ పేరుతో ప్రజలకు మోసం..**
- **విద్యకు 20% బడ్జెట్ కేటాయించాలి.. పేద విద్యార్థులపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వం..**
- **మెస్సీ, బ్యూటీ షోలకి బడ్జెట్... విద్యకు నిధుల్లేవు..**
- **ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్**




**బలగం టీవీ, హైదరాబాద్**

బాలల హక్కుల పరిరక్షణ వేదిక-- తెలంగాణ ఆధ్వర్యంలో, సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విద్యకు 20 శాతం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం విద్య రంగానికి అరకొర నిధులు మాత్రమే కేటాయిస్తూ తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ఇది "రైసింగ్ తెలంగాణ కాదు... ఫాలింగ్ తెలంగాణ" అని వ్యాఖ్యానించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పేరుతో ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని అన్నారు.

విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వం వెచ్చించే ఖర్చులను వ్యయంగా చూడకూడదని, అవి రాష్ట్ర భవిష్యత్తుకు పెట్టుబడులుగా భావించాలని దాసోజు శ్రవణ్ స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి అవసరమైన నిధులు లేకుండా పోయాయని, మరోవైపు ప్రైవేటు పాఠశాలలపై ఎలాంటి నియంత్రణ లేకపోవడంతో విచ్చలవిడితనం పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రభుత్వ బడులకు నిధులు లేకపోవడం, ప్రైవేటు బడులపై నియంత్రణ లేకపోవడం వల్ల విద్య రంగం గందరగోళ స్థితికి చేరుకుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పే ప్రజాపాలన, పారదర్శకత కేవలం మాటలకే పరిమితమైందని, హామీలు నెరవేర్చకుండా దాటవేత ధోరణిని అవలంబిస్తోందని విమర్శించారు.ప్రభుత్వానికి నిజాయితీ లేదని, అందుకే కేంద్రం నుంచి నిధులు రావడం లేదని ఆయన ఆరోపించారు. నిజాయితీ లేకపోవడం, నిధుల కొరత, నియంత్రణ లేకపోవడం కలిసి విద్య రంగంలో విచ్చలవిడితనానికి దారితీస్తున్నాయని అన్నారు.

మార్పు అని చెప్పే కాంగ్రెస్ నాయకులు, ఆ మార్పుకు తగిన విధంగా ఒక స్పష్టమైన విధానాన్ని రూపొందించేందుకు సమయం ఇవ్వడం లేదని దాసోజు శ్రవణ్ విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు గడిచినా ఇప్పటివరకు ఒక్క విద్యా విధానం కూడా రూపొందించకపోవడం దారుణమని వ్యాఖ్యానించారు.మెస్సీతో ఫుట్‌బాల్ ఆడేందుకు, ప్రపంచ సుందరి పోటీలు నిర్వహించేందుకు బడ్జెట్ కేటాయించే ప్రభుత్వం, విద్య రంగానికి మాత్రం తగిన నిధులు కేటాయించడం లేదని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సమయంలో ఎమ్మెల్సీ కాకపోయినా అజారుద్దీన్‌ను మంత్రిగా ప్రమాణస్వీకారం చేయించిన ప్రభుత్వం, ప్రొఫెసర్ కోదండరామ్‌కు విద్యాశాఖ మంత్రిగా అవకాశం ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు.

ప్రొఫెసర్ కోదండరామ్‌ను విద్యాశాఖ మంత్రిగా నియమిస్తే వచ్చే నష్టం ఏమిటో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదని విమర్శించారు.

సీఎం రేవంత్ రెడ్డి వేల కోట్లు ఖర్చు చేసి హార్డ్‌వేర్ యూనివర్సిటీలో తరగతులకు హాజరవుతున్నారని, కానీ రాష్ట్రంలోని పేద విద్యార్థుల కోసం మాత్రం తగిన నిధులు కేటాయించడం లేదని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తీవ్రంగా విమర్శించారు.

# వేములవాడ అభివృద్ధే మా ఎజెండా

- **ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ,వేములవాడ,**



వేములవాడ అభివృద్ధే మా ఎజెండా అని,మీ అమూల్యమైన ఓటు చేతి గుర్తుపై కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రభుత్వ విప్ అధి శ్రీనివాస్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వేములవాడ పట్టణం నాంపల్లి 5వ,6వ తిప్పపూర్ 7వ, 8వ వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల తరపున ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, గత పదేళ్లలో బీఆర్ఎస్, బీజేపీ ప్రభుత్వాలు వేముల వాడను పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని,తిప్పపూర్ బ్రిడ్జి, రాజన్న ఆలయ అభివృద్ధి వంటి కీలక పనులను కూడా చేయలేదన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే హామీలు ఇస్తారని, గెలిచాక ప్రజలను మరిచిపోతారని అన్నారు.

తిప్పపూర్‌లో మూలవాగు బ్యూటిఫికేషన్‌కు రూ.86 లక్షలు నిధులు విడుదల చేశామని, లో లెవెల్ బ్రిడ్జి నిర్మాణాన్ని కూడా చేపడతామని అన్నారు. తిప్పపూర్ బస్ స్టాండ్ వేములవాడకు ముక్కు లాంటిదని, గత ప్రభుత్వం తొలగించేందుకు ప్రయత్నిస్తే తానే అడ్డుకున్నానని,ప్రస్తుతం రూ.1 కోటి 60 లక్షలతో బస్ స్టాండ్‌ను ఆధునీకరిస్తున్నామని అన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ఓటు వేస్తే మురుగు కాలువలో వేసినట్లేనని,కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని, డబుల్ బెడ్‌రూం ఇళ్ల పేరుతో ప్రజలను మోసం చేశారని అన్నారు. వేములవాడలో సొంత స్థలం లేని సుమారు 2000 మంది పేదలకు అడుగు స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వం నూతన రేషన్ కార్డులు, ఉచిత సన్నం బియ్యం, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు. సన్నం బియ్యం పంపిణీ తెలంగాణలో మాత్రమే జరుగుతోందని పేర్కొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పని చేస్తోందని, ప్రజలు తమ అమూల్యమైన ఓటుతో చేతి గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.ఈ ప్రచార కార్యక్రమంలో సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సంద్రగిరి శ్రీనివాస్, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ తదితరులు పాల్గొన్నారు

# ఎన్నికల నియమావళికి అనుగుణంగా విధులు నిర్వర్తించాలి



- **ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళికి అనుగుణంగా అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తించాలని ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ సూచించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జోనల్ ఆఫీసర్స్, ఆర్ఓలు, ఏఆర్ఓలు, పీఓలు, ఏపీఓలకు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంచార్జి గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా.. నిజాయితీగా ఎంతో జాగరూకతతో నిర్వర్తించాలని ఆదేశించారు. నియమ, నిబంధనల స్పష్టమైన అవగాహన ఉండాలని, ఎస్ ఈ సీ హ్యాండ్ బుక్ వెంట ఉండాలని సూచించారు. ఎస్ ఈసీ మార్గదర్శకాల మేరకు సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని అన్నారు.

సిరిసిల్లలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రం గీతానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తామని .,ఎన్నికల అధికారులు, సిబ్బంది ఎన్నికల సామగ్రితో వారికి కేటాయించిన వాహనాల్లోనే వెళ్లాలని,పోలింగ్ కేంద్రంలో ఎన్నికల రోజున అన్ని ఏర్పాట్లను సరి చూసుకోవాలని అన్నారు.ఓటర్లు 18 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి తీసుకువెళ్ళి ఓటు హక్కు వినియోగించుకోవచ్చని అన్నారు. పోలింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్ అనుమతి లేదని స్పష్టం చేశారు. బ్యాలెట్ పేపర్ అకౌంట్, బ్యాలెట్ బాక్స్ లు చెక్ చేసుకొని తీసుకువెళ్లాలని ఆదేశించారు.

గుర్తింపు కార్డు ఉన్న పోలింగ్ ఏజెంట్స్, ఎన్నికల అధికారులు మినహా ఎవరికీ అనుమతి లేదని అన్నారు.పోలింగ్ ముగిసిన తర్వాత సామగ్రి అంతా సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సినారే కళామందిర్ లో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రానికి తరలించి అప్పగించాలని అన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని పిలుపు నిచ్చారు.

ఈ నెల 7, 8 తేదీల్లో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కార్యాలయాల్లో ఫెసిలిటేషన్ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని అన్నారు.పోలింగ్ కేంద్రాల్లో అధికారులు, సిబ్బందికి కనీస వసతులు, భోజనం ఇతర సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీఓ వెంకటేశ్వర్లు, ట్రైనింగ్ నోడల్ అధికారి శ్రీనివాసాచారి, జిల్లా విద్యాధికారి జగన్ మోహన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, తహసీల్దార్ మహేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

# అక్రమ నగదు, మద్యం రవాణాను సమర్థవంతంగా అరికట్టాలి..

- **చెక్ పోస్ట్ ల వద్ద విధులలో ఉన్న అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి..**
- **వెంకటాపుర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో వెంకటాపుర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ ను పట్టణ ఇన్స్పెక్టర్ తో కలసి జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే గురువారం రోజున తనిఖీ చేసి వాహన తనిఖీల రిజిస్టర్లు పరిశీలించరు.చెస్ పోస్ట్ వద్ద విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి వివరాలను నమోదు చేయాలన్నారు.పోలింగ్ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉంటూ ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా జరిగే నగదు,మద్యం వంటి అక్రమ రవాణాను అరికట్టాలని సూచించారు.

మున్సిపల్ కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుండి ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై 06 కేసులు నమోదు చేయడం జరిగిందని,తనిఖీల్లో 26,70,000/- రూపాయల నగదు సీజ్ చేయడం జరిగిందని,10 కేసులలో 85.695 లీటర్ల మద్యం సీజ్ చేయడం జరిగిందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రక్రియ మొత్తం సజావుగా జరిగేలా 80 కేసులలో 127 మందిని బైండోవర్ చేయడం జరిగిందన్నారు.ప్రజలందరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ, ఎస్.ఐ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

# పాఠశాలలో మద్యం కలకలం..

- **మద్యం తాగి క్లాస్‌కు వచ్చిన ఎనిమిదో తరగతి విద్యార్థులు!**
- **విద్యార్థుల బ్యాగులు తనిఖీ చేయగా బయటపడ్డ మద్యం సీసాలు**

**బలగం టీవీ, కరీంనగర్?:**



తెలంగాణ రాష్ట్రంలో యథేచ్ఛగా సాగుతున్న బెల్ట్ షాపుల దందా పసిపిల్లల భవిష్యత్తును బుగ్గిపాలు చేస్తోంది. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో చోటుచేసుకున్న ఓ హృదయవిదారక ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. చిగురుమామిడి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కొందరు విద్యార్థులు గురువారం నాడు మద్యం సేవించి పాఠశాలకు హాజరయ్యారు. తరగతి గదిలో విద్యార్థుల ప్రవర్తన అసాధారణంగా ఉండటంతో అనుమానం వచ్చిన ఉపాధ్యాయులు వారిని గమనించారు. వారి వద్ద నుండి మద్యం వాసన రావడంతో ఉపాధ్యాయులు దిగ్భ్రాంతికి లోనయ్యారు.

ఉపాధ్యాయులు వెంటనే సదరు విద్యార్థుల బ్యాగులను తనిఖీ చేయగా, అందులో ఖాళీ మద్యం సీసాలు మరియు సగం తాగిన సీసాలు బయటపడ్డాయి. ఉపాధ్యాయులు విద్యార్థులను మందలించి విచారించగా, పాఠశాలకు సమీపంలోనే ఉన్న ఒక బెల్ట్ షాపు నుండి తాము మద్యం కొనుగోలు చేసినట్లు విద్యార్థులు నిర్భయంగా ఒప్పుకున్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా వెలిసిన బెల్ట్ షాపుల వల్లే చిన్న పిల్లలు మత్తుకు బానిసలవుతున్నారని స్థానికులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# క్రిప్టో కరెన్సీ పేరుతో భారీ మోసం: నలుగురు అరెస్ట్..

- **'ఈగల్ కాయిన్' పేరిట రూ. లక్షల్లో వసూళ్లు.. మూడు కార్లు, నాలుగు ఫోన్లు స్వాధీనం...**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



క్రిప్టో కరెన్సీ మరియు మల్టీ లెవెల్ మార్కెటింగ్ పేరుతో అమాయక ప్రజలను బురిడీ కొట్టించి లక్షలాది రూపాయలు వసూలు చేసిన ముఠాను సిరిసిల్ల పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఇన్స్పెక్టర్ కృష్ణ ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.ఈ సందర్భంగా సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ మాట్లాడుతూ.. సిరిసిల్ల పట్టణానికి చెందిన కొంతమంది వ్యక్తులు ముఠాగా ఏర్పడి 'ఈగల్ కాయిన్' అనే ఆన్‌లైన్ కంపెనీ పేరుతో పెట్టుబడులు సేకరించడం ప్రారంభించారు. ఇది ఒక చైన్ సిస్టమ్ అని, ఇందులో డబ్బులు ఇన్వెస్ట్ చేస్తే అతి తక్కువ కాలంలోనే భారీ లాభాలు వస్తాయని నమ్మబలికారు. విద్యానగర్‌కు చెందిన ముచ్చ రాజేందర్ అనే వ్యక్తి వీరి మాటలు నమ్మి సుమారు 11 లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టాడు. 18 నెలల్లో 30 లక్షలు వస్తాయని నిందితులు హామీ ఇవ్వగా, బాధితుడికి కేవలం ఒక లక్షా ఇరవై వేల రూపాయలు మాత్రమే తిరిగి ఇచ్చారు. మిగిలిన డబ్బుల కోసం బాధితుడు నిందితులను నిలదీయగా, వారు సరైన సమాధానం చెప్పకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు ఆరుగురిపై కేసు నమోదు చేయగా, ప్రస్తుతం నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో వంగరి వేణు గోపాల్ (40), ఆడెపు శ్రీధర్ (44), మంచికట్ల సుధాకర్ (42), దోమల ప్రవీణ్ (41) ఉన్నారు. మరో ఇద్దరు నిందితులు పాశికంటి లవన్ కుమార్, సుభాష్ ప్రస్తుతం పరారీలో ఉన్నారు. నిందితుల నుండి మోసానికి ఉపయోగించిన 3 ఖక్మీూ సోనేట్ కార్లు మరియు 4 స్మార్ట్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అధిక లాభాల ఆశ చూపే ఇటువంటి ఆన్‌లైన్ కంపెనీలు, క్రిప్టో స్కామ్‌ల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. 'ఈగల్ కాయిన్' పేరుతో ఇంకెవరైనా మోసపోయి ఉంటే ధైర్యంగా ముందుకు వచ్చి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఇన్స్పెక్టర్ కృష్ణ తెలిపారు.

# రైతు భరోసాపై మోసం..

- **ఎన్నికల్లో ఓట్ల కోసం రైతులతో చెలగాటం..**
- **మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్:**



రైతు భరోసా పథకం అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హామీల అమలు విషయంలో కాంగ్రెస్? ప్రభుత్వం పై ఆయన మండిపడ్డారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, కాంగ్రెస్ పార్టీ రైతులను, కూలీలను నిలువునా మోసం చేసిందని విమర్శించారు.

ఎకరాకు రూ. 15,000 రైతులకు, కౌలు రైతులకు ఇస్తామని.. అలాగే రైతు కూలీలకు ఏడాదికి రూ. 12,000 అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని నిరంజన్ రెడ్డి ధ్వజమెత్తారు. "పంటలు కోతలకు వస్తుంటే, ఇప్పుడు నాట్లు పూర్తయ్యాక రైతు భరోసా వేస్తామని చెప్పడం రైతులను వెక్కిరించడమే" అని ఆయన అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఓట్ల కోసం మళ్లీ అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

రాష్ట్రంలో యూరియా కోసం రైతులు అల్లాడుతుంటే ప్రభుత్వానికి కనీసం చీమ కుట్టినట్లు కూడా లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులతో చెలగాటం ఆడుతున్న ఈ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

కేసీఆర్ మేడారం వెళ్లలేదని కాంగ్రెస్ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, ఒకవేళ ఆయన వెళ్లకపోతే ప్రజలకు అందాల్సిన పథకాలను ఆపేస్తారా? అని నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. మేడారం జాతర కోసం రూ. 250 కోట్లు ఖర్చు చేశామని చెబుతున్నారని, కానీ నెల తిరగకముందే గద్దెల వద్ద రాళ్లు కూలిపోతుండటం ఈ ప్రభుత్వ అవినీతికి నిదర్శనమన్నారు. కనీస సౌకర్యాలు లేక భక్తులు మంత్రుల వాహనాల అద్దాలు పగులగొట్టారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రజల తీర్పుకు భయపడే కాంగ్రెస్ అబద్ధాలతో పక్కదారి పట్టిస్తోంది. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయమని ఆయన స్పష్టం చేశారు.

# తెలంగాణ గ్రామ పంచాయతీలకు కేంద్రం శుభవార్త

- **15వ ఆర్థిక సంఘం నిధుల**
- **తొలి విడతగా రూ.259.36 కోట్లు విడుదలలిలి**

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణలో కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లకు కేంద్ర ప్రభుత్వం భారీ శుభవార్త అందించింది. ఎప్పటి నుంచో గ్రామ పంచాయతీలకు రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. తొలి విడతగా రూ. 259.36 కోట్లను తాజాగా విడుదల చేసింది. గ్రామ పంచాయతీల పదవీకాలం పూర్తయినప్పటికీ రాష్ట్రంలో ఎన్నికలు ఆలస్యం కావడంతో ఈ నిధుల విడుదలను కేంద్ర ప్రభుత్వం నిలిపివేసిన విషయం తెలిసిందే. పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో నిధులను విడుదల చేయలేమని కేంద్రం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే ఇటీవల రేవంత్ రెడ్డి ప్రభుత్వం గ్రామ పంచాయతీ ఎన్నికలను నిర్వహించింది. ఎన్నికల ఫలితాలు వెలువడడంతో గ్రామాల్లో కొత్త పాలక వర్గాలు ఏర్పడ్డాయి.

కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నా నిధుల లేమితో తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. గ్రామాభివృద్ధి పనులు ప్రారంభించేందుకు ఆర్థిక వనరులు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో తొలి విడత నిధులు విడుదల కావడంతో సర్పంచ్‌లు, పంచాయతీ పాలక వర్గాలకు భారీ ఊరట లభించింది.పంచాయతీ ఎన్నికలు పూర్తికావడంతో రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ అధికారులు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. దీనికి అనుగుణంగా 15వ ఆర్థిక సంఘం నిధుల కింద కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు మొత్తం రూ. 3 వేల కోట్ల వరకు ఇవ్వాల్సి ఉండగా, అందులో తొలి విడతగా రూ. 259. 36 కోట్లను విడుదల చేసింది.మిగిలిన నిధులు కూడా దశలవారీగా విడుదలయ్యే అవకాశముందని అధికారులు తెలిపారు.

# భారత్‌తో వాణిజ్య ఒప్పందాలకు ప్రపంచ దేశాల ఆసక్తి

(మొదటి పేజీ తరువాయి)

అలాగే 10 కోట్ల మంది స్వయంసహాయ సంఘాల మహిళలు లబ్ధి పొందారని వివరించారు. ఎల్ఐసీ, ఎస్‌బీఐ, హెచ్ఏఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను బలోపేతం చేశామని పేర్కొన్నారు.

**వికసిత్ భారత్ దిశగా ప్రయాణం**

ప్రపంచంలో భారత పరపతి పెరుగుతోందని, వెనక్కి తిరిగి చూసుకునే పరిస్థితి లేదని ప్రధాని మోదీ అన్నారు. వికసిత్ భారత్ లక్ష్యంగా దేశం ముందుకు సాగుతోం దన్నారు. అనేక దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, భారత్‌లో యువత జనాభా అధికంగా ఉందని చెప్పారు. దేశంలో ప్రతిభావంతులైన యువతకు కొరత లేదని స్పష్టం చేశారు. రైతుల జీవితాల్లో మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, వచ్చే 25 సంవత్సరాలు దేశానికి అత్యంత కీలకమని తెలిపారు. భారత ఆర్థిక వ్యవస్థ వేగంగా బలపడుతూ, ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారబోతోందని మోదీ ధీమా వ్యక్తం చేశారు. యూపీఏ హయాంలో భారత్ 11వ ఆర్థిక వ్యవస్థగా ఉండగా, ఎన్డీఏ హయాంలో మూడో స్థానానికి చేరుకుంటుందని తెలిపారు.

**విపక్ష సభ్యుల వాకౌట్**

మరోవైపు, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై ప్రధాని ప్రసంగిస్తున్న సమయంలో విపక్ష సభ్యులు నినాదాలు చేశారు. దేశంలో నియంతృత్వం నడవదని, విపక్ష నేతకు మాట్లాడే అవకాశం ఇవ్వాలంటూ వారు డిమాండ్ చేశారు. ఈ నిరసనల మధ్యే ప్రధాని తన ప్రసంగాన్ని కొనసాగించారు. అనంతరం విపక్ష సభ్యులు రాజ్యసభ నుంచి వాకౌట్ చేశారు.



# భారత్ ట్యాక్సీ ప్రారంభించిన అమిత్ షా

(మొదటి పేజీ తరువాయి)

**3 లక్షలకు పైగా డ్రైవర్లు నమోదు**
**లక్ష మందికిపైగా వినియోగదారులు రిజిస్ట్రేషన్**
**డిల్లీ--ఎన్‌సీఆర్, గుజరాత్‌లో రోజుకు 10 వేలకుపైగా ప్రయాణాలు**
**డ్రైవర్లకు ఇప్పటివరకు రూ.10 కోట్లకు పైగా నేరుగా చెల్లింపులు చేసినట్లు వెల్లడించారు.**




**ఎనిమిది సహకార సంస్థల మద్దతు**

భారత్ ట్యాక్సీకి దేశంలోని ఎనిమిది ప్రముఖ సహకార సంస్థలు మద్దతుగా నిలిచాయి. ఈ వేదిక ఉబెర్, ఓలా, రాపిడో వంటి ప్రైవేట్ సంస్థలకు ప్రత్యామ్నాయంగా నిలవనుందని కేంద్ర సహకార శాఖ అధికారులు పేర్కొన్నారు.

ఈ వేదికలో డ్రైవర్లను లిలి'సారథులు'లిలిగా పిలుస్తూ వారికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నారు.

ప్రధానంగా: అత్యవసర సహాయ సేవలు
ధృవీకరించిన ప్రయాణ వివరాలు
ఇతర యాప్‌లలో పనిచేసే స్వేచ్ఛ
ఆరోగ్య, ప్రమాద బీమా
పదవీ విరమణ పొదుపు పథకాలు

డిల్లీలో ఇప్పటికే ఏడు సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. సహకార రంగాన్ని బలోపేతం చేస్తూ, డ్రైవర్ల ఆర్థిక భద్రతను పెంపొందించే దిశగా భారత్ ట్యాక్సీ కీలక మైలురాయిగా నిలుస్తుందని కేంద్ర ప్రభుత్వం అభిప్రాయపడింది.

# తెలంగాణలో ఏప్రిల్ లేదా మేలో 'సర్'

(మొదటి పేజీ తరువాయి)

బీఎల్ఓలు ఇంటింటి సర్వేలు నిర్వహిస్తున్నారని చెప్పారు. సర్ సమయంలో ప్రతి పోలింగ్ ప్రాంతాన్ని బీఎల్ఓలు మూడు నుంచి నాలుగు సార్లు సందర్శిస్తారని వివరించారు. మొదటి సందర్శనలో ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తారని అన్నారు. తదుపరి సందర్శనల్లో ముందుగా అందుబాటులో లేని కుటుంబాలను కవర్ చేస్తారని చెప్పారు. సన్నాహక దశలో మ్యాపింగ్ కాకపోయిన ఓటర్లు కూడా సర్ సమయంలో తమ వివరాలు సమర్పించుకునే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల పాత్రను మరోసారి గుర్తు చేస్తూ అన్ని పోలింగ్ స్టేషన్‌లకు బీఎల్ఏల నియామకాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరారు. బూత్ స్థాయిలో సమర్థవంతం పాల్గొని సమన్వయాన్ని బలోపేతం చేసి, ఫిర్యాదులను తగ్గించి, అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటర్ల జాబితా నుంచి తప్పిపోకుండా చేయడంలో సహాయపడుతుందని అన్నారు. ఈ సమావేశంలో అదనపు సీఈఓ వాసం వెంకటేశ్వర్‌రెడ్డి, డిప్యూటీ సీఆర్ఓ హరిసింగ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# మరోసారి మోసం చేయబోతోన్న కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

పది సంవత్సరాలుగా ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందించిన పార్టీకి, మరియు రెండు సంవత్సరాల్లోనే ఉన్న పథకాలను రద్దు చేసిన కాంగ్రెస్ పార్టీకి మధ్య పోటీ అని, కేసీఆర్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తేనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు తిరిగి ప్రారంభమవుతాయని, ఆ దిశగా ఈ మున్సిపల్ ఎన్నికల నుంచే ఉద్యమం ప్రారంభించాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను నిలదీయకపోతే, ఇచ్చిన హామీలపై ప్రశ్నించకపోతే, మరో మూడు సంవత్సరాల పాటు శాసనసభ ఎన్నికల వరకు ప్రజలకు ప్రభుత్వాన్ని ప్రశ్నించే అవకాశం ఉండదని అన్నారు. ఇప్పుడే హెచ్చరిక జారీ చేసేలా ఓటు వేయకపోతే కాంగ్రెస్ తన మోసాలను కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# గ్రూప్-1 అభ్యర్థులకు భారీ ఊరట

(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నాలు, కుట్రలు జరిగినప్పటికీ న్యాయపరమైన పోరాటంలో రాష్ట్ర ప్రభుత్వం విజయం సాధించిందని సీఎం పేర్కొన్నారు.గ్రూప్-1లో ఎంపికైన 563 మంది అభ్యర్థులకు ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ తర్వాత నియమితులయ్యే తొలి గ్రూప్-1 అధికారుల బ్యాచ్ ఇదేనని తెలిపారు. రాష్ట్ర పునర్నిర్మాణం, అభివృద్ధి కోసం వారు అంకితభావంతో పని చేయాలని సీఎం సూచించారు.

"గ్రూప్-1 నియామకాలపై హైకోర్టు తీర్పును హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నాను. నియామకాలను అడ్డుకోవాలన్న కుట్రలను అధిగమించి న్యాయపరమైన పోరాటంలో విజయం సాధించాం," అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

# బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం

(మొదటి పేజీ తరువాయి)

మండిపడ్డారు. ఫోన్ టాపింగ్ కేసులో కేసీఆర్, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే మధ్య ఢిల్లీ స్థాయిలో రహస్య ఒప్పందం జరిగిందని ఆరోపించారు. అందుకే ఫోన్ టాపింగ్ కేసులో టీఆర్ఎస్ నేతలపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. హైకోర్టు న్యాయమూర్తులు, సినీ హీరోయిన్లు, పత్రికా యాజమాన్యాలు, విలేకరులు, చివరకు సొంత అల్లుడి ఫోన్ కూడా టాపింగ్ చేశారన్న ఆరోపణలు కాంగ్రెస్ ప్రభుత్వమే చేసినప్పటికీ, కేసీఆర్ కూతురు కవిత స్వయంగా వెల్లడించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవని కిషన్ రెడ్డి దుయ్యబట్టారు.

**అప్పుల రాష్ట్రంగా మార్చారు: రామచంద్రరావు**

ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు మాట్లాడుతూ.. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను టీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల రాష్ట్రంగా మార్చిందని ఆరోపించారు. రాష్ట్ర ఏర్పాటైన తర్వాత వ్యయభారం విపరీతంగా పెరిగిందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలోనే రూ. 80 వేల కోట్ల అప్పులు చేసి ప్రజలపై మోయలేని భారాన్ని మోపిందని విమర్శించారు. గత ప్రభుత్వ అవినీతిని కేసీఆర్ కూతురు కవిత స్వయంగా వెల్లడిస్తున్నారంటే వారు ఎంత స్థాయిలో అవినీతి చేశారో అర్థం అవుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర మంత్రి ఆశిష్ చంద్ర, ఎంపీ బీబీ పాటిల్, బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భరత్ గౌడ్, వీరేందర్, కార్పొరేటర్లు సుప్రియ నవీన్ గౌడ్, పావని వినయ్ కుమార్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, నాయకులు సీకే శంకర్రావు, బీజీ కనకేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి ఒక 'బూతుల సీఎం'..

(మొదటి పేజీ తరువాయి)

గురువారం తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో హరీష్ రావు మాట్లాడారు."కేసీఆర్ లేని తెలంగాణ ఉందా? 4 కోట్ల ప్రజల ఆకాంక్షను నిజం చేసిన వ్యక్తి ఆయన. రైతుల కోసం రైతుబంధు, అవ్వాతాతలకు 2,000 పెన్షన్, రైతు బీమా, గురుకులాలు తెచ్చిన కేసీఆర్‌ను ప్రజలు 'జాతిపిత'గా పిలుచుకుంటే రేవంత్ రెడ్డికి ఎందుకంత కడుపునొప్పి?" అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి కంటే పరుషంగా, బూతులతో సమాధానం చెప్పడం మాకు చేతకాక కాదు, మాకున్న సంస్కారం వల్ల మేము దిగజారి మాట్లాడటం లేదని హరీష్ రావు స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి తెలంగాణ చరిత్రలో 'బూతుల ముఖ్యమంత్రి'గా మిగిలిపోతారని ఎద్దేవా చేశారు. తెలంగాణ మేధావులు, రిటైర్డ్ ఉద్యోగులు రేవంత్ రెడ్డి వికృత భాషను ఖండించాలని పిలుపునిచ్చారు. ఇది తెలంగాణ ఆత్మగౌరవంపై జరుగుతున్న దాడి అని, ఉద్యమ చరిత్రను చిన్నబుచ్చే ప్రయత్నమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తన రెండేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని, తన చేతగానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికే రేవంత్ రెడ్డి ఇలాంటి భాషను ఎంచుకున్నారని ఆరోపించారు. గురుకులాల్లో విద్యార్థుల మరణాలపై ఎందుకు స్పందించడం లేదు? 20 లక్షల మంది విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి ఎందుకు మాట్లాడటం లేదు? ఉద్యోగుల పీఆర్సీ (గ్రాక్మ్రజ), డీఏ (ణూా) బకాయిలు, నిరుద్యోగుల జాబ్ క్యాలెండర్ హామీలు ఏమయ్యాయి? ప్రజల సమస్యలను గాలికి వదిలేసి, కేవలం కేసీఆర్ త్యాగాన్ని తక్కువ చేసే ప్రయత్నమే రేవంత్ రెడ్డి పనిగా పెట్టుకున్నారని, ఇలాంటి వ్యక్తి ముఖ్యమంత్రి కావడం తెలంగాణ ప్రజల దౌర్భాగ్యమని హరీష్ రావు ధ్వజమెత్తారు.

రేవంత్ రెడ్డి జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదు కానీ స్కాం క్యాలెండర్ మాత్రం ఇచ్చారు. ప్రతినెలా ఉద్యోగాలు భర్తీ చేస్తానని చెప్పి, నెలకు ఒక స్కామ్ చేశారు. జనవరిలో సివిల్ సప్లైస్ స్కాం, ఫిబ్రవరిలో ఎన్టీపీసీ ప్లై యాష్ స్కాం, మార్చిలో సాండ్ స్కాం, ఏప్రిల్‌లో ఆర్టీసీ స్కాం,మేలో బామ్మర్దికిచ్చిన అమృత్ టెండర్ల స్కాం, జూన్‌లో ఫోర్త్ సిటీ (ఖీశీబత్రీష్త్ర జఊఎ) స్కాం, జూలైలో లగచర్ల, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ల్యాండ్ స్కాం, ఆగస్టులో పీజీ మెడికల్ సీట్ల స్కాం, సెప్టెంబర్‌లో ఎక్స్మ్రూ ఇండస్ట్రియల్ స్కాం, అక్టోబర్‌లో పవర్ స్కామ్, నవంబర్‌లో సింగరేణి స్కాం, డిసెంబర్‌లో ముఖ్యమంత్రి, కేఎల్ఎస్ఆర్ (ఖూాక్మ్ర) స్కామ్ లని తెలియజేశారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత టి. హరీశ్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన కుర్చీని కాపాడుకోవడం కోసం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్ రెడ్డి పాలనలో ప్రజా సమస్యలకు పరిష్కారం లేదని, ఆరు గ్యారెంటీలను గాలికి వదిలేశారని హరీశ్ రావు విమర్శించారు. "నెలకో కుంభకోణం చేయడం రేవంత్ ప్రభుత్వానికి అలవాటుగా మారింది. వాటి గురించి మేము ప్రశ్నిస్తే, సమాధానం చెప్పలేక తిట్ల దండకం అందుకుంటున్నారు. స్కీములు, హామీల గురించి అడిగితే ప్రజలను డైవర్షన్ చేస్తున్నారు. ఒకటి రెండు సార్లు డైవర్షన్ చేయగలవు కానీ, ప్రతిసారి చేస్తానంటే ప్రజలే నిన్ను గద్దె దించి ముఖ్యమంత్రి పదవి నుంచి డైవర్షన్ చేస్తారు, బిడ్డ జాగ్రత్త!" అని హెచ్చరించారు.

నల్గొండ మిర్యాలగూడ సభలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. 2014 నుండి 2023 వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం 11.5 కి.మీ. ఎస్.ఎల్.బి.సి టన్నెల్ పనులను పూర్తి చేసింది. ఈ 14 నెలల కాలంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కనీసం 100 మీటర్ల పని కూడా చేయలేదు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత చర్యల వల్ల టన్నెల్ పనులు కుప్పకూలితే, ఆ ప్రమాదంలో చిక్కుకున్న శవాలను కూడా బయటకు తీయలేని దద్దమ్మ ప్రభుత్వం మీది కాదా అని ప్రశ్నించారు. పెండ్లిపాక, దిండి రిజర్వాయర్లు మరియు టన్నెల్ పనుల కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 4000 కోట్లు ఖర్చు చేసిందని గుర్తు చేశారు.నల్గొండ జిల్లాను ఫ్లోరైడ్ రహితంగా మార్చిన ఘనత కేసీఆర్ గారిదేనని హరీశ్ రావు స్పష్టం చేశారు. వంకరబోయిన కాళ్లతో ఉన్న ఫ్లోరైడ్ బాధితులను ప్రధానమంత్రి టేబుల్ మీద పెట్టిన దుస్థితి కాంగ్రెస్ హయాంలోనే జరిగిందని, నాగార్జునసాగర్ అలైన్‌మెంట్ మార్చి నల్గొండకు అన్యాయం చేసింది కూడా కాంగ్రెస్సేనని ఎద్దేవా చేశారు.

వడ్డీ లేని రుణాల విషయంలో ముఖ్యమంత్రి పచ్చి అబద్ధాలు ఆడుతున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. "రాజన్న మీద ఒట్టేసి రుణమాఫీ చేస్తానని చెప్పి మాట తప్పావు. చొప్పదండికి వస్తావో, కొడంగల్ కు వస్తావో తేల్చుకో.. ఎక్కడ పూర్తి రుణమాఫీ జరిగిందో చూపిస్తావా? రూ. 25 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చానని చెబుతున్నావు, అది నిజమని నిరూపిస్తే నేను ప్రెస్ క్లబ్‌లో చర్చకు సిద్ధం." ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పదవి కోసం బీజేపీతో చీకటి ఒప్పందం చేసుకున్నారని హరీశ్ రావు ఆరోపించారు. మహబూబ్ నగర్ ఎంపీ సీటును బీజేపీకి బహుమానంగా ఇచ్చింది రేవంతేనని, అందుకే కాంగ్రెస్ నేతల ఇళ్లపై ఈడీ, ఐటీ దాడులు జరిగినా ఆ వివరాలు బయటకు రావడం లేదని విమర్శించారు.